క్లుప్తంగా

మట్టినమూనాల సేకరణ



మట్టి నమూనాలు సేకరిస్తున్న ఏవో మురళీకృష్ణ, వ్యవసాయ సిబ్బంది

రేగిడి: భూసార పరీక్షలు నిర్వహించేందుకు మండలంలో గుళ్లపాడు గ్రామంలో పలువురు రైతుల పొలాల నుంచి ఏవో మురళీకృష్ణ సోమవారం వ్యవసాయ సిబ్బందితో కలిసి మట్టి నమూనాలు సేకరించారు. ఏవో మాట్లాడుతూ మట్టినమూనాలను ల్యాబ్‌లకు తరలించి పరీక్షలు చేసి ఫలితాలను రైతులకు తెలియజేస్తామని చెప్పారు. పరీక్షల్లో వచ్చే ఫలితాల ఆధారంగా ఆయా భూములు ఏ పంటలు సాగుచేసేందుకు అనుకూలమో రైతులకు వివరిస్తామన్నారు. భూసారం ఆధారంగా పంటలు సాగు చేయడంతో పాటు ఎరువులు వినియోగించాల్సి ఉంటుందని వివరించారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామ ఆదర్శ పాఠశాలలో సోమవారం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు మొత్తం 217 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏడుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్, పరీక్షల ఛీఫ్ సూపరింటెండెంట్ జ్యోతిలక్ష్మి తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సోంపురంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి

రామభద్రపురం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కృష్ణకుమారి, రత్నకుమారి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని సోమవారం ఆరికతోట, సోంపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారం, తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.తల్లిపాలు బిడ్డకు అమృత సమానమని, బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరునెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రా ల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హౌసింగ్ ఏఈగా వెంకటేష్



మత్స వెంకటేష్

రామభద్రపురం: మండల హౌసింగ్ ఏఈగా మత్స వెంకటేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొద్ది నెలలుగా ఇక్కడ ఇన్‌చార్జ్ ఏఈగా రెడ్డి వేణు గోపాలరావు విధులు నిర్వర్తిస్తున్నా రు. ఆయన స్థానంలో రెగ్యులర్ ఏఈగా వెంకటేష్ నియమితు లయ్యారు. ఈయన బొబ్బిలి డివిజన్ హౌసింగ్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు.

ఆనకట్ట పనుల పరిశీలన



ఆనకట్ట మరమ్మతు పనులు పరిశీలిస్తున్న అధికారులు

సంతకవిటి: మండలంలోని రంగరాయపురం వద్ద నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్ట వద్ద జరుగుతున్న పనులను విశాఖపట్నానికి చెందిన మెకానికల్ సబ్‌డివిజన్ డీఈ రవికాంత్, జేఈ స్వాతిలు సోమవారం పరిశీలించారు. షట్టర్ల నాణ్యతను పరీక్షించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరును వారు ఆదేశించారు.

బీజేపీలోకి పీవీజీ కృష్ణంరాజు



బీజేపీలో చేరుతున్న పీవీజీ కృష్ణంరాజు

రాజాం: రాజాం పట్టణానికి చెందిన వ్యాపారవేత్త పీవీజీ కృష్ణంరాజు బీజేపీలో చేరారు. ఇటీవల రాజమండ్రిలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు రాజేష్‌వర్మ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, పార్లమెంట్ కన్వీనర్ శంబర లక్ష్మీనరసింహశర్మ పాల్గొన్నారు.

పలుగు, పార.. తెచ్చుకోవాల్సిందే!

- ఉపాధి హామీ పనులకు పనిముట్లు కరువు
- గతంలో పలుగు, పార, టార్పాలిన్లు పంపిణీ
- ప్రస్తుతం వాటిని వేతనదారులే తెచ్చుకోవాలి..
- పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కేంద్రం చర్యలు
- కనీస వసతుల్లేక వేతనదారుల అవస్థలు



మండుటెండలో పనిచేస్తున్న వేతనదారులు(ఫైల్)

రాజాం:

ఉపాధి హామీ పథకం పనుల్లో కనీస వసతులు కరువవుతున్నాయి. ఏ గ్రామంలో జరుగుతున్న పనులు చూసినా పని ప్రదేశంలో ఉండాల్సిన టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ వంటివి కనిపించడం లేదు. ముఖ్యంగా పనికి అవసరమైన పనిముట్లు(పలుగు, పార, ఇతర సామగ్రి) ఇంతవరకు పంపిణీ చేయలేదు. దీంతో వేతనదారులే వారి సొంత పనిముట్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండుటెండలో దాహంతో అరకొరగా ఉండే పనిముట్లతో పని ఎలా చేసేదని వేతనదారులు ప్రశ్నిస్తున్నారు. కొలతల ప్రకారం పనిచేస్తే తప్ప గిట్టుబాటు అయ్యే వేతనం రావడం లేదని, పనిముట్లు లేకుండా కొలత ప్రకారం లోతుగా మట్టి తవ్వాలంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నియోజకవర్గంలో 51,911 జాబ్‌కార్డులు..

రాజాం నియోజవర్గంలో మొత్తం 51,911 జాబ్‌కార్డులు యాక్టివ్‌లో ఉండగా, వాటిల్లో 80,777 మంది వేతనదారులు నమోదై ఉన్నారు. ప్రస్తుతం ఉపాధి పనుల్లో 25,247 మంది వేతనదారులు పాల్గొంటున్నారు. వీరందరికీ పని చేసేందుకు అవసరమైన పనిముట్లు లేకపోగా గత నాలుగు నెలలుగా చేసిన పనులకు సంబంధించిన వేతనాలు కూడా అందివ్వడం లేదు.

గతమెంతో ఘనకీర్తి..

ఉపాధి పనులకు సంబంధించి గత ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించేవి. లక్ష్యాలను ముందుగానే నిర్ధారించి, వేసవిలో వేతనదారులకు పూర్తిస్థాయిలో పనులు కల్పించేవి. వలసల నివారణే లక్ష్యంగా ఏర్పాటైన ఈ పథకం కింద మగవారితో సమానంగా ఆడవారికి కూలిడబ్బులు అందించడం ప్రారంభించారు. కొత్త గునపాలు, పారలు, ఐరన్ బేసిన్‌లు అందించేవి. వీటిని శ్రమశక్తి సంఘాల్లోని ఆర్గనైజర్లు, మేట్లు అందుకుని సక్రమంగా పనులు చేసేవారు. ఇప్పుడు అటువంటి సామగ్రి ఎక్కడా లేదు.

నియోజకవర్గంలో వేతనదారుల వివరాలు..

మండలం	జాబ్‌కార్డులు	వేతనదారులు	పనులకు వెళ్తున్న వేతనదారులు
రాజాం	11,425	17,518	5,386 మంది
సంతకవిటి	16,316	21,964	7,264 మంది
రేగిడి	15,213	25,185	8,211 మంది
వంగర	8957	16,110	4,386 మంది

తాటాకు పందిరి వేసుకుంటున్నాం..

గతంలో ఇచ్చినట్లు ఇప్పుడు టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో పని వద్ద నీడ కోసం తాటాకు పందిరి వేసుకుంటున్నాం. ప్రథమ చికిత్స పెట్టె కూడా లేదు. గునపాలు, పారలు కూడా ఇవ్వడం లేదు. ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. – ఎం.వెంకటరమణ, ఉపాధి వేతనదారుడు, శిర్లాం, రేగిడి మండలం

ఎవరి నీరు వారే తెచ్చుకోవాలి..

ఉపాధి పనుల వద్దకు ఎవరి నీరు వారే తెచ్చుకోవాలి. పార, గునపాం, తట్టలు, కొడవళ్లు వంటి పనిముట్లు కూడా గతంలో లాగా లేవు. వేతనదారుల వద్ద ఉన్న పనీపనికిరాని పనిముట్లుతో పనులు చేస్తున్నాం. ఇలా అయితే పనుల్లో నాణ్యత ఎలా వస్తుంది.. గిట్టుబాటు అయ్యే వేతనం ఎలా వస్తుంది. – ఎం.రాముడమ్మ, ఉపాధి వేతనదారు, రాజాం మండలం

పనిముట్లు సరఫరా కాలేదు..

ప్రస్తుతం ఉపాధి పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు ఎటువంటి పనిముట్లు సరఫరా చేయలేదు. గతంలో ఇచ్చిన గునపాలు, పారలు, టెంట్లు ఏపీ ఇంతవరకు ఇవ్వలేదు. ప్రస్తుతం వాటికి ఖర్చు చేసిన డబ్బులే వేతనదారులకు వేతనం కింద ఇస్తుండడంతో వాటి పంపిణీ నిలిచిపోయింది. – ఆర్.హరనాథరావు, ఏపీవో, సంతకవిటి

కంప్యూటర్ విద్యపై దృష్టిసారించాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న తహసీల్దార్ సులోచనరాణి

రామభద్రపురం: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే కంప్యూటర్ విద్యపై దృష్టి సారించాలని తహసీల్దార్ సులోచనరాణి సూచించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో ఐటీ, ఐటీఈఎస్, ఆటోమోటివ్ కోర్సులపై ఇంటర్న్‌షిప్–2025 పూర్తిచేసిన విద్యార్థులకు ఎంఈఓ తిరుమల ప్రసాద్‌తో కలిసి తహసీల్దార్ సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని చెప్పారు.భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడేందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే విద్యార్థులు ఐటీ కోర్సులు అభ్యసించాలని సూచించారు. హెచ్‌ఎం కె.కామేశ్వరరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగభూషణరావు, ఒకేషనల్ టీచర్లు కిరణ్‌కుమార్,ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యం



వేసవి ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రోజురోజుకూ ఎండల తీవ్రత అధికమవుతుండడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. ఈ నేపథ్యంలో సంతకవిటి మండలంలోని గుళ్లసీతారాంపురం రోడ్డు సోమవారం నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. ప్రతిరోజూ 40 నుంచి 41 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవుతుండడంతో అందరూ ఇంటి వద్దనే ఉంటుండడంతో ఇలా జనాలు లేని రోడ్లు, వీధులు తారసపడుతున్నాయి.

– సంతకవిటి

ఆయుధ డిపో వద్దే..వద్దు..



బాడంగిలో బ్రిటిష్ కాలం నాటి ఎయిర్‌స్ట్రిప్ వద్ద ఆయుధ డిపో నిర్మాణం.. వద్దే.. వద్దని పాల్తేరు, మల్లంపేట రైతులు బొబ్బిలి ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఆ నిర్మాణం నిమిత్తం ఒక్క పాల్తేరుకు చెందిన భూముల్లో 700 ఎకరాలు అవసరంగా అధికారులు చెబుతున్నారని, నిర్మాణానికి సన్నాహాలు కూడా చేస్తున్నారన్నారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఏడాదికి మూడు పంటలు పండే తమ భూములను వదులుకునేది లేదన్నారు. అవసరమైతే ప్రాణత్యాగమైనా చేసుకుంటాం గానీ భూమలు ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. అనంతరం ఆర్డీవో రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.సురేష్, బి.శ్రీను, యు.అప్పలనాయుడు, వి.రమేష్, వి.జోగినాయుడు, యు.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి

16,347 కాదు.. 27 వేల పోస్టులూ భర్తీ చేయాలి



రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 27 వేల ఉపాధ్యాయ పోస్టులను ఇదే డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ఏవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబరు బి.రవికుమార్‌లు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు బొబ్బిలిలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కేవలం 16,347 పోస్టుల భర్తీకి మాత్రమే ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందని, అయితే రాష్ట్రంలో మొత్తం 27 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వడమనేది.. ఎన్నో ఏళ్లుగా ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులను మోసగించడమేనన్నారు. అలాగే డీఎస్సీ పరీక్షకు సంబంధించి, జిల్లాకు ఒక పేపరు పెట్టాలని, అభ్యర్థుల వయసు గరిష్ట పరిమితి 47 ఏళ్లకు పెంచాలని, ప్రిపరేషన్‌కు 90 రోజుల గడువు ఇవ్వాలని, పీఈటీ పోస్టుల సంఖ్యను పెంచాలని కోరారు. – బొబ్బిలి

పరామర్శ



సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: మండలంలోని వండానపేటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ముగడ రాముయాదవ్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. ఇటీవల రాముయాదవ్ తండ్రి సూర్యనారాయణ మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ.. ఆ గ్రామానికి సోమవారం వెళ్లి బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సూర్యనారాయణ చిత్రపటం వద్ద పూలు ఉంచి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, వియ్యపు చక్రపాణి, గార రమణ, ఎంపీటీసీలు కింజరాపు సురేష్, పిల్లా గౌరునాయుడు, పొట్నూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని కంచరాం గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కలిశెట్టి పార్వతమ్మను వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సోమవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమె.. సన్‌రైజ్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన.. ఆమె వద్దకు వెళ్లి, ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఎంపీపీ లావేటి సులోచన, పార్టీ రాజాం మండల కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రెండు పూటలా పనిచేయాలి



వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. మొత్తం 220 మంది వేతనదారులు పనులకు హాజరు కాగా వారి మస్తర్లు ఆయన పరిశీలించారు. రెండు పూటలా ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. అప్పుడే రూ.307లు వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు.

వంగర: ఉపాధి హామీ పథకం పనుల ప్రదేశంలో వేతనదారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏపీవో మర్రాపు సత్యవతి సూచించారు. మండల కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్‌లతో సోమవారం సమావేశమైన ఆమె.. ఎండల తీవ్రత దృష్ట్యా రెండు పూటలా చల్లగా ఉన్న సమయాల్లో పనులు చేయించాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలన్నారు.

25 మద్యంసీసాలు పట్టివేత

బొబ్బిలి: పట్టణంలో కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్న 25 మద్యంసీసాలను పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు సోమవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

24న వర్క్‌షాపు

బొబ్బిలి రూరల్: స్థానిక పార్వతీపురం రోడ్డులోని మై హోమ్ కల్యాణ మండపంలో విజన్ 2047 వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఎం.శ్రీను సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి కలెక్టరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హాజరవుతారని, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించండి



తెర్లాం: కాగాంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న జెడ్పీటీసీ లూర్థు, ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

రాజాం సిటీ: గర్భిణులు, బాలింతలు ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం జరిగిన పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరైన ఆయన.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 1000 రోజుల కార్యక్రమంలో భాగంగా తక్కువ బరువు ఉన్న పిల్లలు, గర్భిణులు, బాలింతల సంరక్షణ వివరాలను పోషణ్ ట్రాకర్ యాప్‌లో నేరుగా లబ్ధిదారులే నమోదు చేసుకునే విధానాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి.రజనీదుర్గ వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు.

తెర్లాం: గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు 1000 రోజుల కేర్‌పై అవగాహన కలిగి ఉండాలని తెర్లాం జెడ్పీటీసీ గర్భాపు లూర్థు అన్నారు. మండలంలోని కాగాం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ బాడంగి పీవో కె.రాజ్యలక్ష్మి తదితరులు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

వంగర: మండలంలోని కొప్పరవలస గ్రామంలో 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో దాని స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ఏఈ వేమిరెడ్డి సాంబశివరావు తెలిపారు.

వంగర: మండలంలోని అరసాడ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 11 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ షేక్‌శంకర్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, అడ్డాం బలరాం అనే వ్యక్తిని అరెస్ట్ చేశామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



రేగిడి: అడ్మిషన్ పత్రాలు పొందిన విద్యార్థులతో ఎంఈవోలు ప్రసాదరావు, ఎరకయ్య



బాడంగి: విద్యార్థికి అడ్మిషన్ పత్రం అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

రేగిడి: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్యలు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల ప్రవేశాలకు సంబంధించి, మండలంలోని ఆమదాలవలస గ్రామంలో అడ్మిషన్ డ్రైవ్ సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల వయసు చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే సుశిక్షితులైన ఉపాధ్యాయ సిబ్బంది ఉంటారని, వారితో నాణ్యమైన విద్యాబోధన అందివ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, ఇతర విద్యాసామగ్రి అందిస్తారన్నారు. అనంతరం తల్లిదండ్రుల అంగీకారం మేరకు పలువురి పిల్లలకు అడ్మిషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆమదాలవలస కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాలవలస రమేష్‌కుమార్, ఉపాధ్యాయురాలు ఎస్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండల కేంద్రంలోని పీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిఈడు పిల్లలంతా చేరాలని ప్రధానోపాధ్యాయుడు కోరారు. మండల కేంద్రంలో సోమవారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించి, ఇంటింటికీ వెళ్లిన ఆయన.. పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యతో పాటు పాఠశాలకు అనుబంధంగా నిర్వహిస్తున్న బాలబాలికల వసతిగృహాలు గూర్చి వివరించారు. పాఠశాల వసతిగృహంలో ఉంటూ చదువుకోవచ్చన్నారు.

తెర్లాం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే ఐదేళ్ల వయసు పిల్లలను స్థానిక రెగ్యులర్ పాఠశాలలో ఎంఈవో జె.త్రినాధరావు సోమవారం చేర్పించారు. మండలంలోని కూనాయవలస ప్రాథమికోన్నత పాఠశాలలో పలువురు చిన్నారులను హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్త సింహాచలం చేర్పించారు.

బాడంగి: ట్యాగ్డ్ హైస్కూళ్లల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతుల విద్యార్థులను తిరిగి వారి పాఠశాలలకు పంపించినట్లు ఎంఈవో లక్ష్మణదొర సోమవారం తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నంబరు 117ను ప్రస్తుత ప్రభుత్వం సవరణ చేస్తూ పాత పాఠశాలలకు పిల్లలను పంపిస్తోందన్నారు.

ఆర్డీవో కార్యాలయంలోనే అధికారులంతా..



ఆర్డీవో కార్యాలయంలో అధికారుల బృందం

బొబ్బిలి: స్థానిక ఆర్డీవో కార్యాలయంలోనే అధికారులంతా ఉండిపోవడంతో ఆ అధికారుల పని ఉండి మండల కేంద్రానికి వచ్చిన ప్రజలంతా నిరాశతో వెనుదిరిగారు. ఆర్డీవో రామ్మోహనరావు సహా తహసీల్దారు ఎం.శ్రీను, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఎంపీడీవో పి.రవికుమార్, హౌసింగ్ ఏఈ అల్లు సూర్యనారాయణలతో పాటు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది అంతా ఆర్డీవో కార్యాలయంలోనే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉన్నారు. వారంతా అక్కడే ఉండగా వారి కోసం వచ్చిన ప్రజలు వారి రాకకోసం గంటల తరబడి వేచి చూసి, వారు రారని అనుకుని వెళ్లిపోయారు. ఏ పని లేకుండా అధికారులు ఇలా ఒక్కచోట అన్ని గంటల పాటు ఉండడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.